క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో ప్రతిష్ఠించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివ లింగాన్ని శుక్రవారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూర్ రవీందర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, సిబ్బంది సంజీవ్‌రెడ్డి, కృష్ణ, రాముడు, భీమేశ్వర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

గోపాల్‌పేట: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోవడంతో వ్యక్తికి గాయాలయిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమందడికి చెందిన ప్రవీణ్, భార్య శిరీష, తమ్ముడు నందుతో కలిసి శుక్రవారం తూడుకుర్తిలోని బంధువుల ఇంటికి వచ్చి మధ్యాహ్నం తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. పొలికెపాడు అడ్డరోడ్డు నుండి బుద్దారం మార్గమధ్యలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడిపోయింది. దీంతో ప్రవీణ్ కాలు విరిగిపోయింది. పక్కనే ఉన్న నందు అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో పెద్దమందడికి చెందిన అంబులెన్స్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రవీణ్‌ను వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

'వక్ఫ్ బిల్లు రద్దు చేయాలి'



కొత్తకోట: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కొత్తకోట ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో ముస్లింలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్, నిక్సన్, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు ఇవ్వాలి

పాన్‌గల్: ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యా నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లు లేని పేదవారికి మొదటి విడతలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా మండలంలోని 28 జీపీల్లో 4,941 మంది అర్హులుగా తేల్చారని, వారిలో పక్షపాతం లేకుండా పేదవారికే మొదటి విడతలో అవకాశం కల్పించాలన్నారు. అర్హులను ఎంపిక చేయకపోతే లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో భీమయ్య, రాము, నాగిరెడ్డి పాల్గొన్నారు.

విరాళం అందజేత



కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కొత్తకోట మండల వాస్తవ్యులు అద్విక్‌సాగర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పోతులపల్లి జయమ్మ శ్రీనివాసులు దంపతులు, వారి కుమారులు పోతులపల్లి కల్పన వినోద్‌సాగర్, పోతులపల్లి సవ్యశ్రీ అనిల్‌సాగర్ దంపతులు రూ. 1,00,116లు విరాళంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ధూపం నాగరాజు, పొగాకు అనిల్‌కుమార్, విశ్వనాథం గంగాధర్, సత్యం సాగర్, లక్ష్మీ నారాయణ యాదవ్, భాస్కర్, రాజవర్ధన్‌రెడ్డి, భీమ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ మంజూరు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయించాలని రైతులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కోరారు. ఆయన వెంటనే స్పందించి గ్రామానికి హైమాస్ట్ లైట్ మంజూరు చేయించడంతో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు.



అమరచింత ఎంబీ కర్మేల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



అయిజ ఎంబీ బేతులు చర్చిలో..



తనగల ఎంబీ కల్వరి చర్చిలో..



ఎర్రవల్లిలో..

ఏసు బోధనలు ఆచరణీయం

సాక్షి, నెట్‌వర్క్: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని పాస్టర్లు సూచించారు. శుక్రవారం వనపర్తి, గద్వాల జిల్లాల వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బైబిల్‌లో పొందుపరిచిన సూక్తులను పాస్టర్లు వివరించారు. లోకాన్ని రక్షించేందుకు ఏసయ్య ప్రాణాలను త్యజించారని కొనియాడారు. ప్రతి క్రిస్టియన్ తమ సంపాదనలో పదో వంతు పేదలకు దానం చేయాలని సూచించారు.

- అమరచింత పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిలో పాస్టర్లు హ్యపీపాల్, హనోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ పీటర్, దీనకుమార్, విజయ్‌కుమార్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.
- వనపర్తి మండలంలోని చిట్యాల చర్చిలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చెలిమి సంస్థ జిల్లా అధ్యక్షుడు సిద్ధి రవి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పాస్టర్ తిమోతిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- మల్దకల్ మండలంలోని అమరవాయి, బిజ్వారం, తాటికుంట, నాగర్‌దొడ్డి, ఎల్కూరు, మల్లెందొడ్డి, విఠలాపురం, పాల్వాయి, మల్దకల్ గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



చెన్నిపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సునీల్ అమృత్‌రాజ్

- ఎర్రవల్లి మండల కేంద్రంతో పాటుగా వేముల, కొండేరు, యాక్తాపురం, ధర్మవరం, పుటాన్‌దొడ్డి, వల్లూరు, కారుపాకుల, దువాసిపల్లి, షేకుపల్లి, తదితర గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో ధ్యానం చేస్తూ ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.
- అయిజ మండల వ్యాప్తంగా చర్చీల్లో పాస్టర్లు యేసు ప్రభువు జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. అదేవిధంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు.
- ధరూరు మండల కేంద్రంతో పాటు నెట్టెంపాడు, దోర్నాల, మన్నాపురం, మార్లబీడు, ర్యాలంపాడు, రేవులపల్లి, సోంపురం, అల్వాలపాడు, చిన్నపాడు, చింతరేవుల, గార్లపాడు తదితర గ్రామాల్లోని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, హోసన్నా మందిరం కరుణాకర్, మరనాథ విశ్వాస సమాజం, కల్వరి చర్చి పాస్టర్లు కరుణాకర్, సుదర్శన్ అబ్రహాం, కృపరాజ్ తదితరులు పాల్గొన్నారు.
- శాంతినగర్ మండలంతో పాటు వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. తనగల ఎంబీ కల్వరి చర్చిలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.
- మానవపాడు మండలంలోని చెన్నిపాడులోని బేతేల్ చర్చిలో పాస్టర్ సునీల్ అమృత్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
- ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం, చాగాపురం, మునగాల, పెద్దదిన్నె తదితర గ్రామాల్లోని చర్చీల్లో క్రైస్తవులు ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాతర్ల ఎంబీ చర్చిలో పాస్టర్ మార్క్ ఏసు సందేశం వినిపించారు.



ధరూరు ఎంబీ చర్చిలో..



చిట్యాల చర్చిలో పాస్టర్‌కు సన్మానం

'అభివృద్ధి కోసం శిలాఫలకాలు వెనక్కి తీసుకుంటా'

వీపనగండ్ల: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామంటే తాను గతంలో వేసిన శిలాఫలకాలను వెనక్కి తీసుకుంటానని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభపై సన్నాహక సమావేశాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో గత పాలకులు వేసిన శిలాఫలకాలు ఉండడం వల్లే ఆ పనులు పూర్తి చేయలేకపోతున్నామని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలను చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను కేసుల పేరుతో బెదిరిస్తున్నారని, అలాంటి వారికి రాబోయే రోజుల్లో తగిన సమాధానమిస్తానని స్పష్టం చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమలేశ్వర్‌రావు, అభిలాష్‌రావు, ముంత మల్లయ్యయాదవ్, సత్యనారాయణగౌడ్, సురేష్‌రెడ్డి, సాయిరాం, సర్దార్, శివ యాదవ్, సురేందర్‌రెడ్డి, అంజయ్య నాయక్, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వాల్‌పోస్టర్ విడుదల

గోపాల్‌పేట: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ వజ్రోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రావన్‌కుమార్, బిల్లకంటి రాజు, వెంకటయ్య, శివకుమార్, హర్యానాయక్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

పాన్‌గల్: మెరుగైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని ఎంఈఓ శ్రీనివాసులు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండలంలోని దావాజిపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బడి ఈడు, బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన చేయించడంతో పాటు ఆర్థిక భారం లేకుండా ఉచితంగా విద్యను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కురుమూర్తినాయక్, ఉపాధ్యాయ బృందం రాధాకృష్ణ, లక్ష్మణ్‌యాదవ్, పరమేశ్వరి, భాగ్యశ్రీ, శరణ్య పాల్గొన్నారు.



దావాజిపల్లిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్ పీఎస్‌లో ఫుడ్ ఫెస్టివల్

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు హెచ్‌ఎం పద్మ పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఇళ్లలో నుంచి ఇష్టమైన ఆహార పదార్థాలతో కూడిన లంచ్ బాక్స్‌లతో పాఠశాలకు వచ్చారు. పాఠశాలకు తీసుకొచ్చిన ఆహార పదార్థాలను తమ స్నేహితులతో పరస్పరం పంచుకుంటూ భోజనం చేసినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. విద్యార్థులలో ఐక్యతభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వెంకటేష్‌యాదవ్, బిందు, సుజాత, ఎమ్మార్సీ సిబ్బంది మూర్తి, వంశీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవత విశ్వవిద్యాలయంలో వేసవి శిక్షణ తరగతులు

కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెల్లి శివారులో గల మానవతా విశ్వ విద్యాలయంలో మానవతా సంస్థ ప్రతినిధులు శ్రీనివాసచౌదరి, విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో బాలబాలికలకు ప్రత్యేక ఆరోగ్య శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్యాంప్ నందు వేదిక్ మాథ్స్, కూచిపూడి, సంగీతం, స్పోకెన్ ఇంగ్లిష్, యోగ, భగవద్గీత మొదలైన అంశాలపై తరగతులు ఉంటాయన్నారు. 8 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ టెక్నిక్స్ (శక్తిని బలాన్ని పెంచుకునే సాధనలు), యోగ అభ్యాసాలు- బ్యాలెన్సింగ్, ఆత్మవిశ్వాసం-ఏకాగ్రత, ఆరోగ్యకరమైన ఆహారం వంటిపై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99666 73293, 99666 73111 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

కొత్తకోట: పట్టణంలో నూతన ప్రభుత్వ బాలికల పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు వనపర్తి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యార్థినులు పాఠశాల ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో గల ఏకైక ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో సరైన తరగతి గదులు లేక విద్యార్థినులు ఆరు బయట విద్యనభ్యసిస్తున్నారని వాపోయారు. గత పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమని మండిపడ్డారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో కొమ్ము భరత్‌భూషణ్, ఆవుల రాఘవేందర్‌గౌడ్, కొత్తకోట బాలన్న, యాదిరెడ్డి, రమేష్, చిన్న తిరుపతిసాగర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో దత్తాత్రేయ శ్రీ రామావధూత లక్ష్మీనరసింహ యోగానంద సద్గురు స్వాముల వారి ఉత్సవాల్లో భాగంగా శనివారం అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు రవీందర్‌రెడ్డి చెప్పారు. శనివారం మధ్యాహ్నం 1 గంటల నుంచి ఎద్దులతో బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.15 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు.

దిగంబరస్వామి రథోత్సవం

గట్టు: మండలంలోని బల్గెరలో గురువారం రాత్రి దిగంబరస్వామి రథోత్సవాన్ని కనులపండుగగా నిర్వహించారు. దిగంబరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి రథాన్ని మామిడి ఆకుల తోరణాలు, పుష్పాలతో పాటుగా విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్ధరాత్రి స్వామి వారి ఉత్సవ మూర్తి విగ్రహాన్ని రథంపై ఏర్పాటు చేసి, భక్తులు రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు సందర్భంగా బల్గెర, మాచర్ల గ్రామాలతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

'నిధులు కేటాయించాలి'



అయిజ: హైదరాబాద్‌లోని ఏసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ నివాసంలో గురువారం రాత్రి అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, మాజీ ఎంపీపీ ప్రకాష్‌గౌడ్ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరారు. అదేవిధంగా అయిజను నియోజకవర్గ కేంద్రంగా చేయాలని, మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మార్కెట్ సబ్ యార్డ్‌ను మార్కెట్ యార్డుగా మార్చాలని అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎంను కోరారు.

తాంతియాతోపేకు ఘన నివాళి



శాంతినగర్: సిపాయిల తిరుగుబాటులో ముఖ్య పాత్ర పోషించి అమరుడైన తాంతియాతోపే వర్ధంతి పురస్కరించుకొని వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద శుక్రవారం ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు ఆహ్వానం



అలంపూర్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని అయిజలో ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించే అంతర్జాతీయ మహిళా కబడ్డీ టోర్నమెంట్‌కు హాజరు కావాలని కర్నూల్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే విజయుడిని ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వావిలాల రంగారెడ్డి, కిషోర్, యోబు, అంజి, రాము తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రధాన అర్చకుడు నర్సింహాస్వామి ఆధ్వర్యంలో రాత్రి కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



తాయమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

అయిజ: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామ దేవత తాయమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు మల్లయ్య, కృష్ణయ్య, రామప్ప, మధుసూదన్‌రెడ్డి, రాముడు, నరసింహులు, షేక్షావలి ఆచారి, మాసూమ్, లింగన్న, నాగరాజు, భరత్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీను, లక్ష్మన్న, శ్రీనివాసులు, జంబయ్య, రవి, ముక్తార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన భక్తులు

'అసత్య ఆరోపణలు సరికాదు'

అలంపూర్: ఒక హోదాలో ఉంటూ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని సీనియర్ న్యాయవాది సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడి హోదాలో ఈ నెల 18వ తేదీన పత్రికల్లో వచ్చిన ప్రకటనలతో బార్ అసోసియేషన్ గౌరవాన్ని మంటగలిపినట్లు ఉందని పేర్కొన్నారు. ఆరోపణల ప్రకటనలు రాసే సమయాల్లో పాత్రికేయులు తన వివరణ తీసుకొని ఉంటే బాగుండేదని హితువు పలికారు. స్థానికంగా ఉన్న పాత్రికేయులకు న్యాయవాదుల పరిస్థితులు తెలుసని పేర్కొన్నారు. పాత్రికేయులు బార్ అసోసియేషన్‌కు వస్తే అన్నీ లెక్కలు చూపిస్తామన్నారు. న్యాయవాదులేవరి వద్ద డబ్బులు వసూలు చేయలేదని స్పష్టం చేశారు.

జయప్రదం చేయండి

అలంపూర్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27న నారాయణపేట జిల్లాలో నిర్వహించే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు కోరారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం అలంపూర్ మండల కమిటీ నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జయ్యన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిని నివారిద్దాం



అలంపూర్: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధిని నివారిద్దామని మండల పశు వైద్యాధికారి శంకరయ్య అన్నారు. అలంపూర్ పట్టణంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. మండల పశు వైద్యాధికారి శంకరయ్య, ఓఎస్ ప్రకాష్, గోపాలమిత్రలు రాగూర్‌నాయుడు, ప్రసాద్ గౌడ్, మల్లేష్ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా టీకాలు వేశారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై రాష్ట్రంలో భూ సంబంధిత సమస్యలు సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ చట్టాల్లో చేసిన మార్పుల గురించి వివరిస్తారని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి రైతు సంఘాల నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రక్తదాన శిబిరం

ఇటిక్యాల: ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలని మండల కేంద్రానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ ముబీనా, గద్వాల బ్లడ్ బ్యాంక్ సంస్థ ఆధ్వర్యంలో వారి మిత్రుడు భరత్‌రాజన్ మొదటి వర్ధంతిని పురస్కరించుకొని 26 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్నేహితులు రాజారవీంద్ర, ప్రతాప్, రాజు, నరేష్, గ్రామస్తులు విష్ణువర్ధన్‌రెడ్డి, యాకోబ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

వనపర్తి రూరల్: పట్టణంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుచున్న విద్యార్థి ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని తల్లి దాసరి మహేశ్వరి శుక్రవారం వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. అలంపూర్ మండలంలోని క్యాతూరు గ్రామానికి చెందిన దాసరి బిందు వనపర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 16న ఉదయం హాస్టల్ నుంచి వెళ్లిన ఆమె ఫోన్ స్విచ్ఛాప్ అయింది. చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా.. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి దాసరి మహేశ్వరి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

'పర్యాటక శోభ కల్పించండి'

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయానికి పర్యాటక శోభ కల్పించాలని రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఉదయం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మార్నింగ్ వాక్ ప్రారంభించారు. గ్రామంలోని మహాత్మాగాంధీ, జ్యోతిరావుపూలే, వాల్మీకి. అంబేడ్కర్, భగీరథ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మేంద్రసాగర్, అస్కని రమేష్, పాడురంగ యాదవ్, వీవీ గౌడ్, దేవరశివ, గుంటి రవి పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్ల, మున్ననూరు గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో దీరుమల్లుయాదవ్, స్వామి, చంద్రయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.